సాక్షి
డా. బి ఆర్ అంబేడ్కర్ కోనసీమ
మంగళవారం । 2 । మే । 2023



గిరులు పులకించె.. ఒడలు తరియించే

రత్నగిరి వానుడు, సత్యమైన దైవంగా పేరొందిన శ్రీసత్యదేవుడే వరునిగా మారి సిరులొసంగే శ్రీ అనంత లక్ష్మీసత్యవతీ దేవిని పరిణయ మాడిన శుభవేళ సత్యగిరులు పులకించాయి. 8లో



ఇద్దరు అంతర్ జిల్లా దొంగల అరెస్ట్

అంతర్ జిల్లాల దొంగతనాలకు పాల్పడుతున్న ఇద్దరు నిందితులను సోమవారం అరెస్ట్ చేసినట్లు కొవ్వూరు డీఎస్పీ బీఎస్ఎన్ వర్మ తెలిపారు. -8లో

పరిపాలనపై అవగాహన పెంచుకోవాలి



పరిపాలన విధానంపై నూతనంగా ఎంపిక అయిన ఎంపీడీఓలు అవగాహన పెంచుకోవాలని సామర్లకోట ఈటీసీ ప్రిన్సిపాల్, జెడ్పీ డిప్యూటీ సీఈఓ జె.వేణుగోపాల్ అన్నారు. 8లో

న్యూస్‌రీల్

సేవకుల ఆత్మ గౌరవ దినం మేడే

రాష్ట్ర మంత్రి వేణు



మున్సిపల్ కార్మికులకు యూనిఫాం, సామగ్రి అందిస్తున్న మంత్రి వేణు

రామచంద్రపురం: మేడే అంటే సేవకుల ఆత్మ గౌరవ దినంగా రాష్ట్ర బీసీ సంక్షేమ, సినిమాటోగ్రఫీ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ అభివర్ణించారు. రామచంద్రపురం మున్సిపల్ కార్మికులతో పాటు మేడే వేడుకల్లో మంత్రి వేణు పాల్గొన్నారు. మున్సిపల్ కార్యాలయ ప్రాంగణంలో మంత్రి వేణు కార్మికుల జెండాను ఎగురవేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మికుల్లో మున్సిపల్ కార్మికుల సేవలు వెలకట్టలేనివని అన్నారు. వారితో పాటు మేడే పండుగలో పాల్గొనడం సంతోషం కలిగించిందన్నారు.

అనంతరం మున్సిపల్ కార్మికులకు యూనిఫాంలు, సబ్బులు, నూనె తదితర సామగ్రి అందజేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ గాధంశెట్టి శ్రీదేవి, మున్సిపల్ కమిషనర్ కె. శ్రీకాంత్‌రెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకులు గాధంశెట్టి శ్రీధర్, దొమ్మలపాటి సత్యనారాయణ, మల్లిడి సత్తిరెడ్డి, మున్సిపల్ కార్మికులు పాల్గొన్నారు.

కోర్టు తీర్పు అభినందనీయం

రైలు దహనం కేసు కొట్టివేతపై కాపు నేతల హర్షాతిరేకాలు

అమలాపురం టౌన్: తుని రైలు దహనం కేసులో విజయవాడ రైల్వే కోర్టు ఇచ్చిన తీర్పు అభినందనీయమని కోనసీమకు చెందిన కాపు నేతలు పేర్కొన్నారు. గుర్తు తెలియని వ్యక్తులు రైలును దహనం చేస్తే కాపు ఉద్యమ నేతలపై అప్పట్లో కేసులు నమోదు చేయడం బాధాకరమని వారు తెలిపారు. ఈ వాస్తవాలను కోర్టు అధ్యయనం చేసి కేసును లోతుగా పరిశీలించి తుది విచారణలో కేసును కొట్టి వేయడంపై కాపు నేతలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. కోనసీమ కాపు నాయకుడు నల్లా పవన్‌కుమార్, జిల్లా కాపునాడు అధ్యక్షుడు అబ్బిరెడ్డి సురేష్ సోమవారం సాయంత్రం అమలాపురంలో విడుదల చేసిన వేర్వేరు ప్రకటనల్లో హర్షాతిరేకాలు తెలిపారు. అప్పటి ఉమ్మడి జిల్లాకు చెందిన 41 మందిపై తుని రైలు దహనం కేసులు నమోదు చేశారని గుర్తు చేశారు. అందులో కోనసీమకు చెందిన కాపు రిజర్వేషన్ పోరాట సమితి రాష్ట్ర కన్వీనర్ నల్లా విష్ణుమూర్తి, కోనసీమ కాపు జేఏసీ కన్వీనర్ కల్వకొలను తాతాజీ, రాష్ట్ర కాపు నాయకుడు ఆకుల రామకృష్ణతోపాటు మరో తొమ్మిది మంది నాయకులు ఉన్నారని పేర్కొన్నారు. తుని సంఘటన జరిగిన రోజున అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబు కాపు నేతలు, కార్యకర్తలపై అన్యాయంగా కేసులు నమోదు చేయించారని నల్లా పవన్‌కుమార్ ఈ ప్రకటనలో ధ్వజమెత్తారు. అప్పట్లో ఏపీ పోలీసులు నమోదు చేసిన వందలాది కేసులను ప్రస్తుత రాష్ట్ర ప్రభుత్వం ఎత్తివేసిందని గుర్తు చేశారు. రైల్వే కేసులు మాత్రం గత ఏడేళ్ల నుంచి కాపు నేతలు నిందితులుగా తరచూ విజయవాడ రైల్వే కోర్టుకు వెళ్లేలా వెంటాడాయని ఆయన పేర్కొన్నారు.

దేశంలో దొంగలు పడ్డారు!

- ఆర్థిక నేరాల్లో 'తమ్ముళ్ల'ది అందె వేసిన చేయే
- ఆదిరెడ్డి అండ్ సన్ అరెస్టుతో మరోసారి చర్చనీయాంశం
- గతంలోనూ అనేక అక్రమాలు



సాక్షి ప్రతినిధి, కాకినాడ: 'ఆవు చేలో మేస్తుంటే దూడ గట్టున మేస్తుందా' అనే సామెత టీడీపీ నేతలకు సరిగ్గా సరిపోతుంది. ఆర్థిక నేరాల్లో తెలుగు తమ్ముళ్లది అందె వేసిన చెయ్యేనన్న విషయం ఆదిరెడ్డి అండ్ సన్ అరెస్టుతో మరోసారి చర్చల్లోకి వచ్చింది. అధికారంలో ఉన్నప్పుడు చంద్రబాబు నుంచి ద్వితీయ శ్రేణి నేతల వరకూ అందరిదీ ఒకటే మాట ఒకటే బాటగా అవినీతి రాజ్యమేలింది. జన్మభూమి కమిటీల పేరుతో తెలుగు తమ్ముళ్లు అడుగడుగునా ప్రజలను నిలువునా దోచుకున్నారు. ఇది చాలదా అన్నట్టు ప్రజలను మాయమాటలతో మభ్యపెట్టి కోట్లకు కోట్ల రూపాయలు వసూలు చేసి పలాయనం చిత్తగించిన వారూ ఉన్నారు.

వెంటాడుతున్న పాపాలు

చిట్టీలు, ఫైనాన్స్‌ల పేరుతో ప్రజలను జలగల్లా పీక్కు తిన్న నేతలు ఒక్కొక్కరినీ రాష్ట్ర ప్రభుత్వం చట్ట ప్రకారం కటకటాల్లో వేస్తోంది. తాజాగా రాజమహేంద్రవరం సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి భవానీ భర్త వాసు, ఆయన తండ్రి, మాజీ ఎమ్మెల్సీ అప్పారావులను సీఐడీ అధికారులు ఆదివారం అరెస్టు చేసి, రిమాండుకు తరలించిన విషయం తెలిసిందే. చిట్‌ఫండ్ చట్టాన్ని తుంగలోకి తొక్కి, ఆర్థిక లావాదేవీల్లో పెద్ద ఎత్తున అవకతవకలకు పాల్పడుతున్న అభియోగాలపై వీరిని అరెస్టు చేశారు. చేసిన పాపాలు వెంటాడుతూనే ఉంటాయని పెద్దలు అంటారు. ఇప్పుడు ఆదిరెడ్డి విషయంలోనూ అదే జరిగిందని ఆ పార్టీ నేతలే గుసగుసలాడుకుంటున్నారు. చిట్టీల పేరుతో చిట్‌ఫండ్ చట్టాన్ని ఉల్లంఘించి లావాదేవీలన్నింటినీ నగదు రూపంలో నిర్వహించడం.. ఒకచోట కార్యాలయం రిజిస్టర్ చేసి, మరోచోట నిర్వహించడం.. అసలు అనుమతి లేకుండానే కాకినాడలో ప్రాంతీయ కార్యాలయం నిర్వహించడం వంటి అనేక అవకతవకలకు పాల్పడి, ప్రజలను మోసగించారని సీఐడీ ప్రాథమికంగా నిగ్గు తేల్చింది. లోతైన విచారణ జరుపుతున్న సీఐడీ.. ఇందుకు సంబంధించిన కీలక ఆధారాలు సేకరించే పనిలో ఉంది. ఈ మొత్తం వ్యవహారంలో తండ్రీకొడుకులకు ఉచ్చు బిగుస్తుందని ఆ పార్టీ నేతలే అంటున్నారు.

ఇంకా ఎన్నో..

- తెలుగు తమ్ముళ్ల అక్రమాల్లో కొన్ని బయట పడగా, వెలుగులోకి రానివి చాలానే ఉన్నాయని అంటున్నారు. ప్రజలను మోసగించి బాధితులు, పోలీసుల కళ్లుగప్పి తప్పించుకు తిరుగుతున్న తెలుగు తమ్ముళ్లు చాలా మందే ఉన్నారు.
- తూర్పు గోదావరి జిల్లా కొవ్వూరు రెండో వార్డు టీడీపీ ఇన్‌చార్జి అక్కాబత్తుల చిన్నారావు ఇలానే చిట్టీల పేరుతో ప్రజలను నిలువునా ముంచేసి పరారైపోయాడు. ఏసీఆర్ చిట్స్ పేరుతో ప్రజల నుంచి డబ్బులు కొల్లగొట్టి, రెండేళ్ల క్రితం బోర్డు తిప్పేశాడు. ఈ తెలుగు తమ్ముడి చేతిలో ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల్లోని సుమారు 5 వేల మంది మోసపోయారు. చిన్నారావు ఏకంగా ఐదారు కోట్ల రూపాయలు కొల్లగొట్టేశాడు. అతడి మోసాలపై బాధితులు పోలీసులను ఆశ్రయించారు.
- కోనసీమలో 1996 తుపాను అనంతరం బాధితులకు వచ్చిన రేషన్ బియ్యాన్ని నాటి ఎమ్మెల్యే దివంగత పులపర్తి నారాయణమూర్తి అడ్డంగా బొక్కేసినట్టు వచ్చిన ఆరోపణలు అప్పట్లో పెను సంచలనమే అయ్యాయి.
- ఉప్పలగుప్తం మండలానికి చెందిన మిల్లర్, అప్పటి జెడ్పీటీసీ సభ్యుడు దేశంశెట్టి లక్ష్మీనారాయణ టీడీపీ అధికారంలో ఉండగా పెద్ద మొత్తంలో రేషన్ బియ్యం దారి మళ్లించాడు. టీడీపీ నేతలు గట్టి ఒత్తిడి తీసుకువచ్చినా ముక్కుసూటిగా పోయిన అప్పటి సీఐ వైఆర్‌కే శ్రీనివాస్ అమలాపురం పట్టణ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేశారు. అయినప్పటికీ ఆ తెలుగు తమ్ముడి అక్రమాల దందాలో మార్పు రాలేదు. మరోసారి రేషన్ బియ్యాన్ని దారి మళ్లించిన వ్యవహారంలో అతడిపై ఉప్పలగుప్తం పోలీసులు తాజాగా మరో కేసు నమోదు చేయడం గమనార్హం. ఈవిధంగా నాటి నుంచి నేటి వరకూ టీడీపీలో చిన్నాచితకా నాయకుల నుంచి బడా నేతల వరకూ ఇదే పంథాలో అక్రమాలకు కేరాఫ్ అడ్రస్‌గా నిలుస్తున్నారు.

వైరివర్గం ఖుషీ

ఆదిరెడ్డి తండ్రీ తనయుల అరెస్టు ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా టీడీపీలో హాట్ టాపిక్‌గా మారింది. నిత్యం ఎదుటి వారిపై బురద జల్లడమే పనిగా పెట్టుకున్న ఆ పార్టీ అగ్రనేతలకు వీరి అరెస్టులతో గొంతులో పచ్చి వెలక్కాయ పడినట్టయ్యింది. చిట్టీల పేరుతో చేసిన మోసాన్ని ఆధారాలతో సహా సీఐడీ బయట పెట్టడం వారికి మింగుడు పడటం లేదు. మొదటి నుంచీ రాజకీయంగా ఆదిరెడ్డిని వ్యతిరేకిస్తున్న వర్గం మాత్రం ఈ పరిణామాలను నిశితంగా పరిశీలిస్తోంది. ఎక్కడా బయట పడకుండా అంతర్గతంగా సంబరాలు చేసుకుంటోంది. రాజమహేంద్రవరం సిటీపై ఆధిపత్యం కోసం ఇటు ఆదిరెడ్డి, అటు రాజమహేంద్రవరం రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి వర్గాలు చాలాకాలం నుంచి నువ్వా నేనా అనే స్థాయిలో పోటీ పడుతున్నాయి. పార్టీపై గుత్తాధిపత్యాన్ని అధిష్టానం తమ కుటుంబానికే రాసి ఇచ్చేసినట్టు ఏకపక్షంగా వ్యవహరిస్తూ వచ్చిన ఆదిరెడ్డికి తగిన శాస్తే జరిగిందని ఆయన వైరి వర్గంగా ముద్రపడిన గోరంట్ల అనుయాయులు అంటున్నారు. అలాగని ఆదిరెడ్డి అరెస్టులపై పెదవి విప్పడానికి ఆ పార్టీ నేతలెవరూ ముందుకు రావడం లేదు.

'సహకారం'తో అక్రమాలు

ఇప్పుడంటే ఆదిరెడ్డి జగజ్జనని చిట్‌ఫండ్స్ బండారం బయటపడింది కాబట్టి సీఐడీ పోలీసులు పక్కా ఆధారాలతో అరెస్టు చేశారు. ఇంతకంటే ముందే టీడీపీ ఏలుబడిలో తూర్పు గోదావరి జిల్లా కేంద్ర సహకార బ్యాంక్(డీసీసీబీ)లో జరిగిన కోట్లాది రూపాయల ఆర్థిక కుంభకోణం ఉమ్మడి జిల్లా ప్రజలకు తెలియంది కాదు. నాటి చైర్మన్‌గా ఉన్న ప్రత్తిపాడు నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి దివంగత వరుపుల రాజాపై సీఐడీ కేసు నమోదు చేయడం, ఆయన అరెస్టుకు ప్రయత్నించడం తెలిసిందే. ఆ సమయంలోనే ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలోని ప్రత్తిపాడు, లంపకలోవ, లింగంపర్తి, కిర్లంపూడి, గండేపల్లి, కానవరం, భూపాలపట్నం, మొల్లేరు, రావులపాలెం, వద్దిపర్రు తదితర ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాల్లో టీడీపీ నుంచి ప్రాతినిధ్యం వహించిన సొసైటీల అధ్యక్షులు కోట్లాది రూపాయలు దారి మళ్లించేసి రైతుల నోట మట్టి కొట్టారు. నాడు కోట్ల రూపాయలు కొల్లగొట్టిన అక్రమార్కులపై వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చాక సీఐడీ విచారణ జరిపిస్తోంది.

హోటల్స్ ట్రేడ్ రిజిస్ట్రేషన్ చేసుకోవాలి

జిల్లా పర్యాటక అధికారి వెంకటాచలం

అమలాపురం రూరల్: అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో హోటల్స్ ట్రేడ్ రిజిస్ట్రేషన్ చేసుకోవాలని జిల్లా పర్యాటక అధికారి పి. వెంకటాచలం సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. హోటల్స్, లాడ్జిలు, రెస్టారెంట్లు, వెల్నెస్ సెంటర్లు, ట్రావెల్ ఆపరేటర్లు అందరూ ట్రేడ్ రిజిస్ట్రేషను చేసుకోవాలని పర్యాటకశాఖ ముఖ్య కార్యదర్శి ఆదేశాలు జారీ చేశారన్నారు. ట్రేడ్ రిజిస్ట్రేషను చేయించుకుంటే రాష్ట్ర ప్రభుత్వ సర్టిఫికెట్ ఇస్తుందని, ఈ సర్టిఫికెట్ పొందిన వారికి పర్యాటక ప్రయోజనాలు చేకూరుతాయని తెలిపారు. హోటల్స్, రెస్టారెంట్స్, లాడ్జిలు, గెస్ట్ హౌసుకు మూడు వందల రూపాయలు, హోంస్టేలు, పాస్టేలు రెండు వందల రూపాయలు, టూర్ బోటు ఆపరేటర్స్, అడ్వంచర్ స్పోర్ట్స్', వాటర్, స్పోర్ట్స్ ఆపరేటర్స్‌కు రూ.500, వెల్నెస్ సెంటర్లు, కన్వెన్షన్ హాలు, సర్వీస్ అపార్ట్ మెంట్స్ రూ.500 చెల్లించాలన్నారు. ఏపీ టూరిజం, జీటీవీ, ఇన్ ఏపీ టూరిజం వెబ్‌సైట్ ద్వారా రిజిస్ట్రేషను చేసుకోవాలన్నారు. పూర్తి వివరాలకు జిల్లా పర్యాటక అధికారి ఫోన్ 63099 42025, 73862 29961 నంబర్లలో సంప్రదించాలని తెలిపారు.

ఇంటర్ విద్యార్థులకు రెమిడియల్ క్లాస్‌లు

సాక్షి అమలాపురం: జిల్లాలో ఇంటర్మీడియెట్ పబ్లిక్ పరీక్షలకు సంబంధించి మొదటి, ద్వితీయ సంవత్సరం ఫెయిలైన విద్యార్థులకు ఈ నెల ఒకటి నుంచి 20వ తేదీ వరకు స్పెషల్ రెమిడీయల్ క్లాసులు 20 రోజులు పాటు నిర్వహిస్తున్నట్లు జిల్లా రెవెన్యూ అధికారి సీహెచ్ సత్తిబాబు తెలిపారు. కలెక్టరేట్‌లో రెమిడియల్ క్లాసుల నిర్వహణపై ఆయన విద్యాశాఖ అధికారులతో సమీక్ష జరిపారు. డీఆర్వో మాట్లాడుతూ జిల్లాలో ప్రభుత్వ జూనియర్ కళాశాలలు, సాంఘిక సంక్షేమ శాఖ జూనియర్ కళాశాలలు, ఎయిడెడ్ జూనియర్ కళాశాలలలో రెమిడియల్ స్పెషల్ క్లాసులు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ రెమిడియల్ స్పెషల్ క్లాసులు నిర్వహణ తీరును జూనియర్ కళాశాలలో ప్రిన్సిపాళ్లు పూర్తిగా పర్యవేక్షించాలని సూచించారు. తరగతుల నిర్వహణ కోసం జిల్లాకు రూ.10 లక్షల చొప్పున నిధులు కేటాయించామన్నారు. జిల్లా ఒకేషనల్ ఎడ్యుకేషనల్ అధికారి సత్యనారాయణరెడ్డి, ప్రాంతీయ పర్యవేక్షణాధికారి నరసింహం తదితరులు పాల్గొన్నారు.

అర్జీదారు సంతృప్తి చెందేలా పరిష్కారం



అర్జీ తీసుకుంటున్న కలెక్టర్ హిమాన్షు శుక్లా



అర్జీదారుడి సమస్య వింటున్న ఎస్పీ శ్రీధర్

అమలాపురం రూరల్: ప్రతి అర్జీని క్షుణ్ణంగా విచారించి నిబంధనల మేరకు అర్జీదారు సంతృప్తి చెందే విధంగా పరిష్కార మార్గాలు చూపాలని కలెక్టర్ హిమాన్షు శుక్లా అధికారులను ఆదేశించారు. సోమవారం స్థానిక కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమంలో కలెక్టర్, జిల్లా జాయింట్ కలెక్టర్, జిల్లా రెవెన్యూ అధికారి సీహెచ్ సత్తిబాబు అర్జీదారుల నుంచి సుమారు 50 అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లా డుతూ రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా స్పందన, జగనన్నకు చెబుదాం కార్యక్రమాలను నిర్వహిస్తోందని అధికారులు అర్జీలపై స్పందించి పరిష్కార మార్గాలు సంతృప్తికర స్థాయిలో చూపాల్సిన అవసరం ఉందని స్పష్టం చేశారు. ఒకసారి సమర్పించిన అర్జీ పునరావృతం కాకుండా అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు.

సామాజిక భద్రతా పింఛన్లు, రెవెన్యూ, వైద్య ఆరోగ్య సంక్షేమ పథకాల సమస్యలపై అర్జీలు ఎక్కువగా అందాయి. అకాల వర్షాల మూలంగా రైతులకు క్షేత్రస్థాయిలో అధికార యంత్రాంగం అండగా నిలిచి ధాన్యం కొనుగోలులో పూర్తిగా సహకరించాలని ఆదేశించారు. వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

పోలీసు స్పందనకు 12 వినతులు

అమలాపురం టౌన్: స్థానిక ఎస్పీ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక -స్పందన కార్యక్రమానికి 12 అర్జీలు వచ్చాయి. జిల్లా ఎస్పీ సుసరాపు శ్రీధర్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ఉదయం పూట కురిసిన వర్షం ప్రభావంతో పోలీసు స్పందనకు అర్జీదారుల హాజరు తగ్గింది. ఎస్పీ కార్యాలయ స్పందన కార్యక్రమ పర్యవేక్షణ ఎస్సై సీహెచ్ వెంకటరమణ పాల్గొన్నారు.

సులువుగా కుల ధ్రువీకరణ పత్రం

- కార్యాలయాల చుట్టూ తిరిగే పని లేకుండానే...
- జిల్లాలో ఉత్తీర్ణులు కానున్న 'పది' విద్యార్థులకు శుభవార్త
- గ్రామ, వార్డు సచివాలయాల ద్వారా అందజేతకు ఏర్పాట్లు



గ్రామ సచివాలయం

అమలాపురం టౌన్: గ్రామ, వార్డు సచివాలయాల ద్వారా పాలన, సంక్షేమ పథకాల లబ్ధి ప్రజల ముంగిటకే తెచ్చిన రాష్ట్ర ప్రభుత్వం.. ఉత్తీర్ణులు కానున్న పదో తరగతి విద్యార్థులకు కుల ధ్రువీకరణ పత్రాల జారీ కూడా అంతే సులభతరం చేస్తోంది. జిల్లాలో ఇటీవల పదో తరగతి పరీక్షలు రాసిన 20,967 మంది విద్యార్థులకు ఈ సరి కొత్త విధానం ఓ శుభవార్తే. ధ్రువీకరణ పత్రం కోసం దరఖాస్తు చేసుకోకుండానే, రెవెన్యూ, ఈ-సేవా కార్యాలయాలకు వెళ్లకుండానే అంతకుమించి ఒక్క మాటలో చెప్పాలంటే అడగకుండానే అర చేతిలో పత్రాన్ని పెట్టే వెసులుబాటు అందుబాటులోకి వస్తోంది. జిల్లాలోని 467 గ్రామ సచివాలయాలు, 48 వార్డు సచివాయాల ద్వారా ఈ ఆర్థిక సంవత్సరం నుంచి ఆ విద్యార్థులకు కుల ధ్రువీకరణ పత్రాలు జారీ చేసేందుకు రంగం అవుతోంది.

'పది' విద్యార్థులకు అత్యవసరం

పదో తరగతి పరీక్ష ఉత్తీర్ణులైన విద్యార్థులకు కుల ధ్రువీకరణ పత్రం అత్యవసరం. గతంలో ఈ పత్రం తీసుకున్నా పదో తరగతి ఉత్తీర్ణులయ్యాక తాజా తీసుకోవాల్సిందే. గతంలో ఇవే పత్రాల కోసం విద్యార్థులు పది ఫలితాలు వచ్చాక తమకు దగ్గరలో ఉన్న తహసీల్దార్, ఈ-సేవా కేంద్రాలకు పదే పదే వెళ్లాల్సి వచ్చేది. తహసీల్దార్, ఆర్ఐ, వీఆర్వో ఇలా మూడ దశల్లో దరఖాస్తుపై సంతకాలు చేస్తేనే గాని ధ్రువీకరణ పత్రం జారీ అయ్యేది కాదు. ఇందుకోసం వ్యయప్రయాసలు పడాల్సి వచ్చేది. ఈ కష్టాలకు చెక్ పెడుతూ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో విద్యార్థులు, వారి తల్లిదండ్రుల్లో హర్షాతిరేకాలు వ్యక్తం అవుతున్నాయి. జిల్లాలో పది పరీక్షలు రాసిన 20,967 మంది ఫలితాలు కోసం ఎదురు చూస్తున్నారు. ఇందులో 75 నుంచి 90 శాతం ఉత్తీర్ణులయ్యే అవకాశం ఉంది. వీరంతా తొలుత చేసే పని కుల ధృవీకరణ పత్రం కోసం దరఖాస్తు చేసుకోవడమే. ఇప్పుడు ఆ పని లేకుండా జిల్లా విద్యా శాఖ నుంచి సేకరించిన పదో తరగతి విద్యార్థుల డేటా జిల్లాలోని గ్రామ, వార్డు సచివాలయాల డేటా బేస్‌కు అనుసంధానం చేశారు. ఇలా సేకరించిన డేటాను రెవెన్యూశాఖ గ్రామాల వారీగా విభజించి గ్రామ, వార్డు సచివాలయాల పరిధిలో పనిచేసే వీఆర్వోల లాగిన్‌కు పంపించారు. వీఆర్వోలు ఆ విద్యార్థులు చదువుతున్న పాఠశాలలు, లేదా వారి ఇళ్లకు వెళ్లి పరిశీలించి నివేదిక రూపొందిస్తారు. విద్యార్థులకు కుల ధృవీకరణ పత్రాలు సంబంధిత గ్రామ లేదా వార్డు సచివాలయాలకు వెళితే అందించే వెసులుబాటు అందుబాటులోకి వస్తోంది.

అన్ని ఏర్పాట్లూ చేశాం



గ్రామ, వార్డు సచివాలయాల ద్వారా దరఖాస్తులు లేకుండానే పదో తరగతి పాసైన విద్యార్థులకు కుల ధ్రువీకరణ పత్రాలు ఇవ్వడం మంచి అవకాశం. దీనిని జిల్లాలోని పదో తరగతి పాస్ కానున్న విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలి. గ్రామ, వార్డు సచివాయాల ద్వారా ప్రజలకు అందుతున్న సౌలభ్యాల్లో ఇది కొత్తది. ఇప్పటికే జిల్లాలోని సచివాలయాల కార్యదర్శులకు ఆదేశాలు ఇచ్చాం. పదో తరగతి పాసైన విద్యార్థులకు కుల ధ్రువీకరణ పత్రాలు జారీ చేసేందుకు అన్ని ఏర్పాట్లు చేశాం.

-ఎస్‌వీవీ సత్యనారాయణ, సీఈవో, జిల్లా పరిషత్

ఎండతెరపి లేని వాన

- సగటు 42.2 మిల్లీమీటర్లు
- కళ్లాల్లోనే ధాన్యం... చేలల్లో పనలు
- అమలాపురంలో అత్యధికంగా 73.2 మి.మీ.
- రబీ కోతలకు అవాంతరం
- రైతులకు తోడుగా కదిలిన యంత్రాంగం



ఉప్పలగుప్తంలో వాన నీటిలో వరి పనలు

సాక్షి అమలాపురం: మండు వేసవి. ఎండలు ఠారెత్తించాల్సిన సమయం. కాని అందుకు భిన్నమైన వాతావరణం. రబీ వరి కోతలు జోరుగా సాగుతున్న సమయంలో కురుస్తున్న వర్షాలు అన్నదాతను ఆందోళనకు గురి చేస్తున్నాయి. గత నెల 23న రెండు రోజుల పాటు జిల్లాలో భారీ వర్షాలు కురవగా, తాజాగా సోమవారం భారీ వర్షం మరోసారి ముంచెత్తింది. విదర్భ నుంచి ఉత్తర తమిళనాడు వరకు తెలంగాణ, కర్ణాటక మీదుగా కొనసాగుతున్న ద్రోణి ప్రభావంతో జిల్లాలో తెల్లవారు జాము నుంచి మధ్యాహ్నం వరకు ఈదురుగాలులు, ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం కురిసింది. ఉదయం ఎనిమిది గంటల వరకు సగటున 42.2 మి.మీటర్ల వర్షం కురవగా, అత్యధికంగా జిల్లా కేంద్రమైన అమలాపురంలో 73.2 మి.మీటర్లు, అత్యల్పంగా ఐ.పోలవరం మండలంలో 4.4 మి.మీటర్ల వర్షం కురిసింది. 8 గంటల తరువాత కూడా భారీ వర్షం పడింది. ఉదయం 6 గంటల నుంచి 8 గంటల మధ్యలో ఆకాశం పూర్తిగా మేఘావృతమైంది. ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులుతో వాతావరణం ఆందోళన కలిగించింది. గంటపాటు ఏకధాటిగా వర్షం పడింది. తరువాత కూడా మధ్యాహ్నం వరకు పడుతూనే ఉంది. పట్టణాలు, పల్లెల్లో పలు రోడ్లు నీట మునిగాయి.

కూలిన చెట్లు, విద్యుత్ స్తంభాలు

వర్షాల వల్ల ఉదయం పది గంటల వరకు విద్యుత్ సరఫరాకు అవాంతరాలు ఏర్పడ్డాయి. ఈదురుగాలులకు మలికిపురం మండలం రామరాజులంకలో 33/11 కేవీ పెద్ద స్తంభాలు ఆరు, గృహ అవసరాల కోసం వేసిన స్తంభాలు నేలనంటాయి. పలుచోట్ల కొబ్బరి, ఇతర చెట్లు నేల కూలాయి. ముమ్మిడివరం మండలం తాన్నేలంకలో పిడుగు పడడం వల్ల టీవీలు, ఫ్రిజ్‌లు కాలిపోయాయి.

చి'వరి'లో కలవరం

రబీ పంట పండిందనే ఆనందాన్ని రైతులకు లేకుండా చేస్తోంది వాతావరణం. జిల్లాలో 1.71 లక్షల ఎకరాల్లో రబీ వరిసాగు జరగగా, ఇప్పటి వరకు 72 వేల ఎకరాల్లో కోతలు పూర్తయ్యాయి. పౌరసరఫరాల శాఖ ఆధ్వర్యంలో ఇప్పటి వరకు 32,924.88 మెట్రిక్ టన్నుల ధాన్యం 4,172 మంది రైతుల వద్ద నుంచి సేకరించారు. ఇటు కోతలు, అటు ధాన్యం కొనుగోలు జోరందుకుంటున్న సమయంలో కురిసిన వర్షం రైతును తీవ్ర ఆందోళనకు గురి చేస్తోంది. వర్షాలకు కోతలు జరగని పొలాలకు పెద్దగా నష్టం లేదు. కాని పనల మీద జిల్లా వ్యాప్తంగా సుమారు 450 ఎకరాల వరకు ఉంది. ఇది దెబ్బతినే అవకాశముందని రైతులు ఆందోళన చెందుతున్నారు. చేలల్లో రెండు అడుగుల మేర నీరు నిలిచిపోయింది. ఈ పొలాల్లో వారం పది రోజుల వరకు యంత్రాలతో కోతలు జరిగే అవకాశం లేదు. దీనివల్ల తాము కూలీలపై ఆధారపడి కోతలు కోయించాల్సి వస్తోందని, ఇది భారంగా మారుతోందని రైతులు అంటున్నారు. వర్షాలకు అపరాల చేలు నీట మునగడంతో చనిపోయే ప్రమాదముంది. మంగళవారం భారీ వర్షాలు కురుస్తాయని ఏపీ విపత్తుల నిర్వహణ సంస్థ ప్రకటించడం రైతుల్లో కలవరాన్ని రేకెత్తిస్తోంది. కొబ్బరి, కోకో, పోక, ఆయిల్‌పామ్‌తోపాటు తీరంలో సరుగుడు తోటలకు వర్షం మేలు చేసింది.



రామచంద్రపురం మండలం కుందూరులో తడిసిన ధాన్యాన్ని పరిశీలిస్తున్న మంత్రి వేణు

రైతుల్లో ఆందోళన

వర్షాల వల్ల రైతులకు ఎటువంటి ఇబ్బంది రాకుండా జిల్లా యంత్రాంగం కదిలింది. రాష్ట్ర బీసీ సంక్షేమ, సినిమాటోగ్రఫీ, సమాచార పౌరసంబంధాల శాఖమంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాల కృష్ణ రామచంద్రపురం మండలం ఉండూరు, వెల్ల, కె.గంగవరం మండలం కుందూరు గ్రామాల్లో పంట నష్టాన్ని పరిశీలించారు. కలెక్టర్ హిమాన్షు శుక్లా ముమ్మిడివరం మండలం అనాతవరంలో పర్యటించారు. వర్షాలు పడుతున్నందున కోతలు వద్దని కలెక్టర్ రైతులను కోరారు. ఆలమూరు మండలంలో జేసీ ధ్యానచంద్ర పర్యటించి పంట నష్టాన్ని పరిశీలించారు.

మండలాల వారీగా వర్ష పాతం ఇలా..

మలికిపురంలో 63.6 మి.మీటర్లు, అల్లవరంలో 62.4, ఉప్పలగుప్తం 58.4, అంబాజీపేటలో 55.8, ఆత్రేయపురంలో 54.4, కపిలేశ్వరపురం 52.2, మండపేట 50.6, రావులపాలెం 48.6, పి.గన్నవరం 43.4, కాట్రేనికోన 40.8, మామిడికుదురు 40.2, కొత్తపేట 39.8, అయినవిల్లి 37.6, రాజోలు 34.2, ఆలమూరు 34, సఖినేటిపల్లి 32.4, కె.గంగవరం 31, రాయవరం 26.6, రామచంద్రపురం 24.6, ముమ్మిడివరం 20.6 మి.మీటర్ల చొప్పున వర్షం పడింది.

యంత్రాంగం అప్రమత్తం

మండపేట: ప్రస్తుత వాతావరణ పరిస్థితుల నేపథ్యంలో రైతులకు అండగా అధికార యంత్రాంగం అప్రమత్తమైంది. తహసీల్దార్లు, ఎంపీడీఓలు, వ్యవసాయాధికారులు క్షేత్రస్థాయిలో పంట నష్టం పరిశీలిస్తున్నారు. నష్ట నివారణ చర్యలు చేపట్టేందుకు రైతులకు సూచనలిస్తున్నారు. తడిసిన ధాన్యం, నేలకొరిగిన పంటను సంరక్షించుకునేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను మండపేట వ్యవసాయాధికారి కె.ఏసుబాబు వివరించారు.

నష్ట నివారణ చేపట్టాలిలా..

- తడిసిన ధాన్యం మొలకలు రాకుండా ఉప్పునీటి ద్రావణాన్ని పిచికారీ చేయాలి.
- కళ్లాల్లోని ధాన్యం రాశుల చుట్టూ నీరు చేరకుండా బాటలు చేసుకోవాలి.
- పొలాల్లో పల్లపు ప్రాంతాల్లో ఉన్న ధాన్యాన్ని మెరక ప్రాంతంలోకి తరలించుకోవాలి.
- కోత కోయని పొలాల్లో ముంపు నీరు చేరితే బయటకు పోయే విధంగా బాటలు చేయాలి.
- పనల దశలో నీరు నిలిచి ఉంటే పనలను గట్లపైకి తెచ్చి వాటిపై ఉప్పు పొడి లేదా ఉప్పు ద్రావణాన్ని పిచికారీ చేయడం వలన గింజ మొలకెత్తకుండా, రంగుమారకుండా ఉంటాయి.



తడిసిన ధాన్యం మొలకలు రాకుండా ఉప్పునీటి ద్రావణాన్ని పిచికారీ చేస్తున్న రైతు

- తడిసిన పనలను ఆరకుండానే కుప్పవేయాల్సి వస్తే ఉప్పు ద్రావణంలో కంకులను ముంచి వెంటనే చిన్న కుప్పలుగా వేయడం వలన 20 రోజుల వరకు గింజలు మొలకెత్తకుండా ఉంటాయి.
- పనలు సరిగా ఆరకుండా కుప్ప వేయడం వలన సూర్యరశ్మి లేక ధాన్యం పాడవుతుంది. వరికుప్ప వేసేటప్పుడు పనల వరుసలపై ఉప్పు ద్రావణాన్ని పిచికారీ చేయడం వలన రెండు నుంచి మూడు వారాల వరకు గింజ మొలకెత్తదు.

ఉప్పు ద్రావకం తయారీ

100 లీటర్ల నీటికి 5 కిలలో ఉప్పును కలిపి ద్రావకాన్ని తయారు చేసుకోవాలి. దీన్ని ధాన్యం, పనల మీద చల్లడం లేదా వరి కంకులను ద్రావణంలో ముంచి కుప్ప వేసుకోవాలి. ఎకరా వరి పంటకు 80 నుంచి 100 కిలోల ఉప్పు అవసరం ఉంటుంది.

క్లుప్తంగా

3 వరకూ ఇంటర్ సప్లిమెంటరీ ఫీజు గడువు

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): ఇంటర్మీడియెట్ పబ్లిక్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలకు సంబంధించి ఫీజు చెల్లించేందుకు ఈ నెల మూడో తేదీతో గడువు ముగుస్తుందని ఇంటర్ బోర్డు ఆర్ఐవో ఎన్ఎస్‌వీఎల్ నరసింహం సోమవారం తెలిపారు. ఈ నెల 24 నుంచి వచ్చే నెల ఒకటో తేదీ వరకు పరీక్షలు జరుగుతాయన్నారు. విద్యార్థులు, తల్లిదండ్రులు, అన్ని యాజమాన్యాల ప్రిన్సిపాళ్లు గడువు తేదీలోగా ఫీజు చెల్లించాలన్నారు. ఇంటర్ పరీక్షలకు సంబంధించి రీ కౌంటింగ్, రీ వెరిఫికేషన్ కమ్ ఫొటోకు దరఖాస్తు చేసుకునేందుకు ఈ నెల ఆరో తేదీ వరకు గడువు ఉందన్నారు.

సాఫ్ట్ బాల్ సెలెక్షన్‌కు అంతరాయం

కాజులూరు: గొల్లపాలెంలో మంగళవారం జరగవలసిన ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా స్థాయి జూనియర్ బాలుర, బాలికల సాఫ్ట్ బాల్ సెలెక్షన్‌కు వర్షం వల్ల అంతరాయం ఏర్పడింది. మే నెల 26 నుంచి 28వ తేదీ వరకూ కడప జిల్లా రాయచోటిలో జరుగనున్న 10వ జూనియర్ అంతర్ జిల్లాల సాఫ్ట్‌బాల్ చాంపియన్ షిప్ పోటీలకు జిల్లా జట్టును ఎంపిక చేసేందుకు అధికారులు సర్వం సిద్ధం చేశారు. అయితే సోమవారం ఉదయం నుంచి కురుస్తున్న భారీ వర్షాలతో క్రీడా ప్రాంగణమంతా తడిసి ముద్దవ్వటంతో ఆటకు అనుకూలంగా లేకుండా పోయింది. సాఫ్ట్ బాల్ ఆటకు పొడి వాతావరణం అవసరమవుతుంది. దీనికితోడు మరో రెండు రోజులు జిల్లాలో విస్తారంగా వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ నిపుణులు సూచిస్తున్నారు. దీంతో దూర ప్రాంతాల నుంచి వచ్చే క్రీడాకారులను దృష్టిలో ఉంచుకుని కార్యక్రమాన్ని వాయిదా వేస్తున్నట్టు జిల్లా సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు జె.హరికృష్ణ, ఏఎస్ రాంప్రసాద్ తెలిపారు. సెలెక్షన్ ఎప్పుడు నిర్వహించేది త్వరలో ప్రకటిస్తామన్నారు.


స్వామివారికి తలంబ్రాలు తీసుకొచ్చిన మంత్రి సత్యనారాయణ, ఎమ్మెల్యే పర్వత


కల్యాణ వేళ.. కోలాట హేల


స్వామి కల్యాణాన్ని తిలకిస్తున్న అధికారులు, భక్తులు

గిరులు పులకించె.. ఒడలు తరియించె

- కమనీయంగా సత్యదేవుని కల్యాణం
- మంత్రాల సాక్షిగా ఒక్కటైన శ్రీసత్యదేవుడు, అనంతలక్ష్మీ అమ్మవారు
- విద్యుత్ వెలుగులతో మరో వైకుంఠంలా శోభిల్లిన రత్నగిరి
- పట్టువస్త్రాలు సమర్పించిన దేవదాయశాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ


కల్యాణ క్రతువును నిర్వహిస్తున్న పండితులు

అన్నవరం: రత్నగిరి వాసుడు, సత్యమైన దైవంగా పేరొందిన శ్రీసత్యదేవుడే వరునిగా మారి సిరులొసంగే శ్రీ అనంత లక్ష్మీసత్యవతీ దేవిని పరిణయమాడిన శుభవేళ సత్యగిరులు పులకించాయి. దివ్య కల్యాణాన్ని కనులారా వీక్షించిన భక్తజనం తరించారు. కల్యాణ మంటపంలో సుగంధ భరిత పుష్పాలు, విద్యుత్ దీపాలతో సర్వాంగ సుందరంగా ముస్తాబు చేసిన వేదికపై వైశాఖ శుద్ధ ఏకాదశి, సోమవారం రాత్రి 10.33 గంటల సుముహూర్తంలో స్వామి, అమ్మవార్ల కల్యాణాన్ని పండితులు ఘనంగా నిర్వహించారు.

సీతారాములే పెళ్లి పెద్దలు

రత్నగిరి క్షేత్రం పాలకునిగా పూజలందుకుంటున్న శ్రీసీతారాములు పెళ్లి పెద్దలుగా వెంట రాగా, వధూవరులు శ్రీసత్యదేవుడు, అమ్మవారిని సుందరంగా ముస్తాబు చేసిన కల్యాణ వేదిక వద్దకు రాత్రి తొమ్మిది గంటలకు ఊరేగింపుగా తీసుకువచ్చారు. స్వామి, అమ్మవార్లను సింహాసనంపై, సీతారాములను ప్రత్యేక ఆసనంపై ప్రతిష్ఠించారు. దేవస్థానం వేదపండితుల ఆశీస్సుల మధ్య రాత్రి 9–15 గంటలకు మంగళ వాయిద్యాల నడుమ స్వామివారి కల్యాణ వేడుక ప్రారంభమైంది. వేద పండితులు, ఆలయ ప్రధానార్చకులు ఇంద్రగంటి నర్సింహమూర్తి, కోట శ్రీనివాస్, స్పెషల్ గ్రేడ్ వ్రత పురోహితుడు ముత్య సత్యనారాయణ, కల్యాణబ్రహ్మ చామర్తి కన్నబాబు, వ్రత పురోహిత సంఘం అధ్యక్షుడు రవిశర్మ, అంగర సతీష్, పాలంకి పట్టాభి, తదితర పురోహితుల మంత్రోచ్చాటనతో కల్యాణ కార్యక్రమం ఘనంగా ప్రారంభమైంది.

విఘ్నేశ్వర పూజతో శుభారంభం

స్వామివారి కల్యాణ కార్యక్రమానికి ఎటువంటి అవాంతరాలు రాకుండా చూడమని ఆ వినాయకుడిని కోరుతూ పండితులు విఘ్నేశ్వర పూజతో కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. సోమవారం తెల్లవారు జాము నుంచి భారీ వర్షం కురుస్తుండడంతో కల్యాణం ఎలా జరుగుతుందోనని భక్తులు ఆందోళన చెందారు. దీంతో వాన ఆగాలని కోరుకుంటూ ఆలయంలో వండించి బూరెలు సూర్యభగవానునికి నైవేద్యంగా సమర్పించారు. సాయంత్రం నాలుగు గంటల నుంచే వాన ఆగడంతో భక్తులు, అధికారులు ఊపిరి పీల్చుకున్నారు. పండితులు పుణ్యాహవచనం, పాణిగ్రహణానికి సంకల్పం, అమ్మవారికి గౌరీపూజ చేయించారు. ఈ సందర్భంగా స్వామి, అమ్మవార్ల గోత్ర నామాలకు సంబంధించిన ప్రవరలను పండితులు వివరించారు. అనంతరం వరుడు శ్రీసత్యదేవునికి 10.01 గంటలకు యజ్ఞోపవీత ధారణను అర్చకస్వాములు నిర్వహించారు. మహాసంకల్పం, స్వామి వారి పాద ప్రక్షాళన (కాళ్లు కడగడం), కన్యాదానం, మధుపర్కప్రాశన ఘట్టాలను అర్చక స్వాములు నిర్వహించారు. అనంతరం మంగళ వాయిద్యాలు, వేదపండితుల మంత్రాల నడుమ శ్రీసత్యదేవుడు, అమ్మవార్ల శిరసులపై 10.25 గంటలకు జీలకర్ర బెల్లం ఉంచే కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం యోగచ్ఛిద్రాభిషేకం నిర్వహించారు. తరువాత మంగళసూత్రాన్ని భక్తులకు చూపించారు. అనంతరం రాత్రి 10.33 గంటలకు అమ్మవారి మెడలో స్వామివారి తరఫున అర్చకుడు మంగళసూత్రం అలంకరించారు. ఈ కార్యక్రమాన్ని కనులారా వీక్షించిన భక్తులు తన్మయత్వం చెందారు. అనంతరం స్వామి, అమ్మవార్లకు అర్చక స్వాములు 10.45 గంటలకు మంచిముత్యాల తలంబ్రాలు పోశారు. గర్భాలయంలో గల సత్యదేవుడు, అమ్మవారికి కూడా పండితులు ఊరేగింపుగా వెళ్లి అక్షంతలు పోశారు. ఈ ఏడాది గోటితో వలచిన తలంబ్రాలను కూడా వినియోగించారు. నవదంపతులకు రక్షాబంధనాలు, వేదపండితుల ఆశీస్సుల అనంతరం స్వామి, అమ్మవార్లను తిరిగి ఊరేగింపుగా ప్రధానాలయానికి చేర్చారు.

భక్తులకు ప్రసాదాల పంపిణీ

సత్యదేవుని కల్యాణం పూర్తయిన తరువాత ప్రసాదాలు, మంచి ముత్యంతో కూడిన తలంబ్రాలు, సర్క్యులర్ మంటపం, బుకింగ్ కౌంటర్, మరో రెండు కేంద్రాల వద్ద భక్తులకు పంపిణీ చేశారు.

ఆకట్టుకున్న విద్యుత్ అలంకరణ

రత్నగిరి, కల్యాణ వేదిక వద్ద చేసిన విద్యుత్ అలంకరణ, పుష్పాలంకరణ అందరినీ ఆకట్టుకుంది.

ప్రత్యేక పోలీసు బందోబస్తు

కల్యాణ మహోత్సవాన్ని తిలకించడానికి భక్తులు భారీ సంఖ్యలో తరలి రావడంతో వారిని నియంత్రించడానికి పోలీసులు విస్తృత ఏర్పాట్లు చేశారు. సుమారు 300 మంది పోలీసులు ఈ ఏర్పాట్లలో పాల్గొన్నారు. అగ్నిమాపక యంత్రాలను, సిబ్బందిని కల్యాణ వేదిక వద్ద ఉంచారు. రత్నగిరిపైకి భక్తుల వాహనాలను పరిమిత సంఖ్యలోనే అనుమతించారు. దేవస్థానం కళాశాల మైదానంలో ఉచిత పార్కింగ్ స్థలాన్ని ఏర్పాటు చేశారు. ఆన్‌లైన్ ద్వారా రూ.1,500 చొప్పున చెల్లించి 73 మంది దంపతులు యూట్యూబ్ ద్వారా కల్యాణాన్ని వీక్షించారు.

పట్టువస్త్రాలు, ముత్యాల తలంబ్రాలు సమర్పించిన ప్రముఖులు

సత్యదేవుని దివ్యకల్యాణ మహోత్సవానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన రాష్ట్ర దేవదాయ, ధర్మాదాయశాఖా మంత్రి కొట్టు సత్యనారాయణ దంపతులు స్వామి, అమ్మవార్లకు పట్టు వస్త్రాలు, ముత్యాల తలంబ్రాలు సమర్పించారు. ప్రత్తిపాడు ఎమ్మెల్యే పర్వత శ్రీపూర్ణ చంద్రప్రసాద్ దంపతులు కూడా స్వామి, అమ్మవార్లకు పట్టువస్త్రాలను, మంచి ముత్యాల తలంబ్రాలను సమర్పించారు. దేవస్థానం తరఫున ఈఓ చంద్రశేఖర్ అజాద్ దంపతులు స్వామి, అమ్మవార్లకు నూతన వస్త్రాలను సమర్పించారు. ఇంకా టీటీడీ, విజయవాడ దుర్గగుడి, ద్వారకాతిరుమల దేవస్థానం తరఫున ఆయా దేవస్థానాల పండితులు కూడా పట్టువస్త్రాలను సమర్పించారు.

ఇద్దరు అంతర్ జిల్లా దొంగల అరెస్ట్

- రూ.29.50 లక్షల విలువైన ఆభరణాలు స్వాధీనం
- డీఎస్పీ బీఎస్ఎన్ వర్మ


వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ వర్మ, చిత్రంలో సీఐలు వెంకటేశ్వరరావు, రవికుమార్


కొవ్వూరు: వేర్వేరు కేసుల్లో అంతర్ జిల్లాల్లో దొంగతనాలకు పాల్పడే ఇద్దరు నిందితులను సోమవారం అరెస్ట్ చేసినట్లు డీఎస్పీ బీఎస్ఎన్ వర్మ తెలిపారు. వీరి నుంచి రూ.29.50 లక్షల విలువైన బంగారు, వెండి ఆభరణాలు, రెండు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. పట్టణంలో డీఎస్పీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశం ఆయన వివరాలు వెల్లడించారు. ఏలూరు నగరంలో నిమ్మకాయల యార్డ్ ప్రాంతానికి చెందిన షేక్ మున్నామెరకవీధిలో అనుమానంగా సంచరిస్తుండడంతో పట్టణ సీఐ ఏఎల్ఎస్ రవికుమార్ స్టేషన్‌కి తీసుకెళ్లి విచారించగా చోరీల చిట్టా బయట పడిందన్నారు. మున్నా 2017లో జేబు దొంగతనాలు ప్రారంభించాడన్నారు. 14 కేసుల్లో నిందితుడన్నారు. 2022లో ఏలూరులో నాలుగు, కొవ్వూరు సబ్ డివిజన్ పరిధిలో ఆరు దొంగతనాలకు పాల్పడినట్లు తెలిపారు. కొవ్వూరు పట్టణంలో రెండు కేసుల్లో 45.730 గ్రాముల బంగారు ఆభరణాలు స్వాధీనం చేసుకున్నామన్నారు. నిడదవోలు మండలం సమిశ్రగూడెం స్టేషన్‌లో పరిధిలో ఒక కేసులో 14.150 గ్రాముల నల్లపూసల తాడు చోరీ చేశాడన్నారు. ఏలూరు రూరల్ పోలీసు స్టేషన్ పరిధిలో 35.800 గ్రాముల బంగారు ఆభరణాలు, 185 గ్రాముల వెండి ఆభరణాలు స్వాధీనం చేసుకున్నామన్నారు. చాగల్లు పోలీసు స్టేషన్‌లో ఓ చోరీ కేసులో 22.100 గ్రాముల, నిడదవోలు స్టేషన్ పరిధిలో 39.900 గ్రాముల ఆభరణాలను, ఏలూరు ఒకటో నంబర్ పట్టణ పోలీసు స్టేషన్ పరిధిలో ఓ కేసులో 14.750 గ్రాములు, దేవరపల్లి స్టేషన్‌లో ఓ కేసులో 28.200 గ్రాములు, దెందులూరు పోలీసు స్టేషన్ పరిధిలో రెండు రెడ్‌మీ సెల్‌ఫోన్‌లు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. మొత్తంగా తొమ్మిది కేసుల్లో 200.63 గ్రాముల బంగారు ఆభరణాలు, 185 గ్రాముల వెండి ఆభరణాలు, రెండు సెల్‌ఫోన్‌లను మున్నా నుంచి స్వాధీనం చేసుకున్నట్లు డీఎస్పీ వర్మ తెలిపారు. వీటి విలువ రూ.10.50 లక్షలు ఉంటుందన్నారు. నిందితుడిని కోర్టులో హాజరు పరచనున్నట్లు తెలిపారు. సీఐ రవికుమార్‌తో పాటు ఎస్సై పి.రవీంద్రబాబు, ఇతర సిబ్బంది ఈ కేసులో కీలక భూమిక పోషించారన్నారు. మున్నా ట్రాన్స్‌జెండర్ అని చెప్పారు. కేసు ఛేదించిన సీఐ, ఎస్సైలతో పాటు ఇతర సిబ్బందికి రివార్డు నిమిత్తం జిల్లా ఎస్పీకి సిఫార్సు చేయనున్నట్లు తెలిపారు.

మరో తొమ్మిది కేసుల్లో రూ.19.50 లక్షల ఆభరణాలు స్వాధీనం

ఉండ్రాజవరం పోలీసులు విశ్వసుల అనిల్ కుమార్‌ను అరెస్ట్ చేసి అతని నుంచి తొమ్మిది కేసుల్లో రూ.19.50 లక్షల విలువైన బంగారు ఆభరణాలను స్వాధీనం చేసుకున్నారని డీఎస్పీ బీఎస్ఎన్ వర్మ తెలిపారు. కాకినాడ జిల్లా తొండంగి మండల రావికంపాడు గ్రామానికి చెందిన అనిల్‌కుమార్ గతంలో కాకినాడ, అన్నవరం, తణుకు పోలీసు స్టేషన్ల పరిధిలో పలు దొంగతనాల కేసుల్లో నిందితుడన్నారు. ఇతడిని విచారించగా ఉండ్రాజవరం పరిధిలో ఐదు, పెరవలిలో రెండు, సమిశ్రగూడెం, తణుకు టౌన్ పోలీసు స్టేషన్‌ల పరిధిలో ఒక్కో చోరీకి పాల్పడినట్లు తేలిందన్నారు. రాత్రి సమయాల్లో ఇంటిలో దొంగతనాలు చేయడంలో ఇతడు నేర్పరి అన్నారు. అనిల్‌కుమార్‌కి తండ్రి చిన్న వయస్సులోనే చనిపోయారు. తల్లి గల్ఫ్ దేశాలకు వెళ్లింది. మేనమామ సంరక్షణలో ఉంటూ కత్తిపూడిలో ఒక చోరీ కేసులో అరెస్ట్ అయ్యి రాజమహేంద్రవరం సెంట్రల్ జైలుకి వెళ్లాడు. అక్కడ ఇద్దరు పాత నేరస్తులతో పరిచయం ఏర్పడి దొంగతనాలు చేయడం అలవాటుగా మార్చుకున్నాడని తెలిపారు. నిడదవోలు సీఐ కె.వెంకటేశ్వరరావు పాల్గొన్నారు. ఉండ్రాజవరం ఎస్సై కె.రామారావు, పి.రవీంద్రబాబు, ఏఎస్సై ఏకే సత్యనారాయణ, హెచ్‌సీ కె.నాగేశ్వరరావు, సిబ్బంది రెండు బృందాలుగా ఏర్పడి ఈ చోరీ కేసులు ఛేదించారన్నారు. నిందుతుడిని కోర్టుకి హాజరు పరచనున్నట్లు డీఎస్పీ వర్మ తెలిపారు.

పరిపాలనపై అవగాహన పెంచుకోవాలి

- ఈటీసీ ప్రిన్సిపాల్ వేణుగోపాల్
- రాష్ట్రంలోని ఎంపీడీఓలకు శిక్షణ ప్రారంభం


ఎంపీడీఓలతో మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ వేణుగోపాల్

సామర్లకోట: పరిపాలన విధానంపై నూతనంగా ఎంపిక అయిన ఎంపీడీఓలు అవగాహన పెంచుకోవాలని ఈటీసీ ప్రిన్సిపాల్, జెడ్పీ డిప్యూటీ సీఈఓ జె.వేణుగోపాల్ అన్నారు. రాష్ట్రంలో నూతనంగా ఎంపిక అయిన 40 మంది ఎంపీడీఓలకు నెలరోజుల పాటు నిర్వహించే శిక్షణను సోమవారం ఆయన ప్రారంభించారు. ప్రభుత్వ పథకాలతో పాటు, జీఓలపై అవగాహన ఉండాలన్నారు. మండల పరిషత్తు సమావేశాలు, బడ్జెట్ తయారీ, అత్యవసర పనుల గుర్తింపు, కేంద్ర, రాష్ట్ర పభుత్వాల నుంచి విడుదల అవుతున్న నిధులు, గ్రామాలకు కేటాయింపు అంశాలపై అవగాహన కల్పించారు. నూతనంగా బాధ్యతలు స్వీకరించిన ఎంపీడీఓలకు ఆరు నెలల పాటు శిక్షణ ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించిందన్నారు,. దీనిలో భాగంగా ఇప్పటికే నెల రోజుల పాటు బాపట్ల విస్తరణ శిక్షణ కేంద్రంలో శిక్షణ పొందారన్నారు. సామర్లకోటలో నెల రోజుల పాటు శిక్షణ పొందిన తరువాత ఆయా జిల్లాల్లో డీపీఆర్‌సీ సెంటర్ల ద్వారా ఫీల్డు విజిట్ శిక్షణ ఉంటుందన్నారు. ఆ తరువాత శ్రీకాళహస్తి విస్తరణ శిక్షణ కేంద్రంలో నెల రోజుల పాటు శిక్షణ ఉంటుందని తెలిపారు. అక్కడ శిక్షణ పూర్తి చేసుకొన్నాక ఆయా జిల్లాల్లో ఫీల్డు విజిట్ శిక్షణ ఉంటుందని చెప్పారు. సెప్టెంబర్‌లో నెల రోజుల పాటు ఈటీసీలో తుది శిక్షణ ఉంటుందని చెప్పారు. శిక్షణలోని ప్రతీ అంశంపై దృష్టి సారించి సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈటీసీ వైస్ ప్రిన్సిపాల్ ఈ.కృష్ణమోహన్ మాట్లాడుతూ గతంలో ఎంపీడీఓలు ఉద్యోగంలో చేరితే ఎంపీడీఓలుగానే పదవీ విరమణ చేయవలసి ఉండేదన్నారు. నేడు రాష్ట్ర ప్రభుత్వం ఎంపీడీఓలకు సీనియార్టీని బట్టి పదోన్నతులు ఇచ్చే విధంగా జీఓ జారీ చేసిందని తెలిపారు. శిక్షణలో భాగంగా ఫీల్డు విజిట్‌తో పాటు కంప్యూటర్ శిక్షణ కూడా ఉంటుందన్నారు. ఈటీసీ ఫ్యాకల్టీలు పి.శ్రీనివాసరావు, ఎంఎస్ఎన్ రెడ్డి, నిహారిక, జీవీ శ్రీదేవి, వెంకటేశ్వరావు, బి.ఆంజనేయులు, పి.ప్రసాద్ శిక్షణ నిర్వహించారు.